# 14

# ది ఎండ్‌లెస్ ట్రావెల్

*బస్సులో తనతోపాటు ప్రయాణిస్తోన్న వాళ్ళందరి ముఖాలూ కంప్యూటర్ గ్రాఫిక్స్‌లా మారిపోతున్నాయి. తన ముందు సీట్లో కూర్చుని వున్న కండక్టరు ముఖం తోడేలై కోరలు చాస్తోంది.*

"ఏరుమా... ఏరు... యేరు ఎన్నా పాకిరియే"

అసలే ఆ రద్దీలో నుండి ఎలా పైకెక్కాలో అర్థంకాక సతమతమవుతోన్న జానక్కి, కండక్టరలా హడావిడి పెట్టేయడంతో మరింత కంగారూ, చిరాకూ కలిగాయి. ఉదయం నుండీ తుప్పర పడ్తుండడంవల్ల నేలంతా చిత్తడి చిత్తడిగా వుంది.

ముడిచి నీళ్ళుకారుతోన్న గొడుగునీ, లావుపాటి హేండ్‌బ్యాగ్‌నీ సవరించుకుంటూ చీరకుచ్చిళ్ళని ఎత్తిపట్టి మెల్లగా బురద నిండిన చెప్పుల కాళ్ళని మొదటి మెట్టు మీద ఆనించింది.

జానకి తీసుకున్న జాగ్రత్తలు సరిపోలేదన్నట్లుగా ఆ మెట్టు అడుగున దాక్కున్న మేకు తగులుకుని ఆమె చీర పర్రుమంది. మరింత కంగారుపడిపోయి, సర్దుకుని... అలవోగ్గా వొంగి దాన్ని తప్పించడానికి ప్రయత్నిస్తోన్న ఆమె నడుంమీద వెనకనున్న వ్యక్తి చేయి పడింది.

పిల్లపామేదో శరీరం మీద పాకినట్టయి, విదిలించుకుంటూ రెండో మెట్టుమీద అడుగు పెట్టింది. ఇక ఆ తరువాత జానక్కి ఎక్కాల్సిన

అవసరమే కలగలేదు... వెనకనున్న జనాలే జానకిని బస్సు లోపలికి నెట్టేశారు. అవమానంతోనూ, చికాకుతోనూ జానకి మొహం ఎర్రబడిపోయింది. మెల్లిగా ఒకపక్కకి సర్దుకుని లేడీస్ సీట్ల వైపుగా ఒదిగి రాడ్లని పట్టుకుని బ్యాలెన్స్ చేస్తోంది జానకి. ఆమె ముందు కూర్చుని వున్నావిడ జానకి పరిస్థితిని గమనిస్తూ ఆమె చేతిలో నుండి హేండ్‌బ్యాగూ, గొడుగు అందుకుని పలకరింపుగా నవ్వింది.

అతికష్టం మీద పెదాల మీదికి చిరునవ్వుని తెచ్చుకుని ఆవిడకేసిచూసి 'థాంక్యూ' అంటూ మెల్లిగా గొణుక్కుంది జానకి. మరి జానకి కృతజ్ఞతలు ఆవిడకి విన్పించాయో లేదో చెప్పడం కష్టం.

"టికెట్... టికెట్... యారుమా టికెట్."

నదిని చీల్చుకుని వస్తున్న క్రీస్తులా, జనాల్ని చీల్చుకుని వచ్చిన కండక్టరు దాదాపుగా జానకిని ఆనుకుని నిలబడి ప్రశ్నిస్తున్నాడు అందరినీ.

జానకి తన ముందావిడ ఒళ్ళోవున్న హేండ్ బేగ్ మీదికి ఒంగి బ్యాలెన్స్ చేస్తూనే పై జిప్ లాగి సీజన్ కార్డు తీసింది. దాన్ని టిక్ చేసి ఆమెకి అందించి తిరిగి ఆమెని రాసుకుంటూ ముందుకి వెళ్ళిపోయాడు కండక్టరు.

ఇది రోజూ వుండే మేళమే అయినా ఎప్పటికప్పుడు కొత్తగానే ఆమె ముఖం కోపంతో ఎర్రబారుతూ వుంటుంది. ఆ మున్సిపలాఫీసులో ఉద్యోగమొక ఎత్తయితే ఈ సిటీబస్సులో ప్రయాణం మరో ఎత్తు.

ఉద్యోగం చేయాల్సి వచ్చిన తన పరిస్థితినీ, కుటుంబాన్నీ, ఆఫీసునీ అందులోని వ్యక్తుల్ని పేరుపేరునా తిట్టుకుంది జానకి. తన శరీరపు బరువుని మరో కాలు మీదకి మార్చుకుంటూ.

బస్సు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఆగింది. ఇక్కడ ఎవరయినా దిగుతారేమోనని ఎదురుచూడలేదు జానకి. గత ఏడేళ్ళుగా ఆమె ఈ బస్సులో ఉదయం, సాయంత్రం ప్రయాణం చేస్తూంది. సాయంత్రం తిరుగు ప్రయాణంలో ఇక్కడికొచ్చేటప్పటికి బస్సు దాదాపుగా ఖాళీ అయిపోతుంది కానీ, వెళ్ళేప్పుడు మాత్రం ఎవరూ దిగకపోగా మరికొంత మంది నెట్టుకుంటూ బస్సెక్కుతారు. అయితే జానకి ఊహించని విధంగా ఆమె ముందున్నావిడ హఠాత్తుగా లేచి,

"నా ఎరంగపోరే... నీంగవుక్కోరుంగు. యనుకు డైరెక్ట్ బస్సు యిరుకుదింగె" అంటూ హడావిడిగా దిగిపోయింది.

జానకి ఊపిరి పీల్చుకుని తన హేండ్‌బ్యాగ్‌నీ, గొడుగునీ అందుకుంటూ ఆమె ఖాళీ చేసి వెళ్ళిన సీట్లో కూలబడింది. మరోసారి గాఢంగా నిట్టూర్చి బస్సులో నుండి బయటికి చూసింది.

చినుకులు పడుతూనే వున్నాయి. అంతా హడావిడిగా అటు, ఇటు పరిగెడు తున్నారు. కొన్ని కొన్నిచోట్ల జనాలు కాక గొడుగులు మూకుమ్మడిగా నడుస్తున్నట్టున్నాయి. ఆకాశం కారుస్తోన్న కన్నీరు చిటపటమంటూ నేలను తాకకుండా గొడుగుల మీద పడి నిరాశగా జారుతున్నాయి.

ప్లాట్‌ఫారమ్ మీద సరుకులు పెట్టి అమ్ముకునేవాళ్ళు అన్నీ ప్యాక్‌చేసి పట్టాలు కప్పి వున్నారు. ఒక నిముషంపాటు వర్షం ఆగినపుడు పట్టాలుతీసి సరుకుల్ని సర్దబోవడం... తిరిగి చినుకులు మొదలవడంతో హడావిడిగా పట్టాలు కప్పడం... షాపుల్లో వ్యాపారం లేక తీరికూర్చున్న ఓనర్లు ఈ ప్లాట్‌ఫామ్ మనుషులు లవకుశార్థం చూసి ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్నారు.

అయినా పట్టుదలగా కొంచెం వర్షం ఆగినట్లు కన్పించగానే తమ సరుకుల్ని అమ్మకానికి పెట్టున్నారు ప్లాట్‌ఫామ్ వ్యాపారస్థులు. వాళ్ళలా మాటమాటికీ సరుకుల్ని సర్ది పట్టలు కప్పుతూ వుంటే దారిద్ర్యం కొరికిన బతుకుల్ని వైండప్ చేసేస్తోన్న మూగ జీవుల్లా తోచారు జానక్కి.

"కాలీలె యిరందు ఒరే మల... నా అంగె యెరంగి నడకుణం... ఎప్పడి పోదుమే తెరీలే." (ఉదయం నుండీ ఒకటే వర్షం... నేను దిగి నడవాలక్కడ... ఎట్లా వెళ్ళాలో తెలీడంలేదు.)

జానకి పక్కన కూర్చున్నావిడ వర్షాన్ని తిట్టుకుంటున్నట్లుగా జానకిని పలకరించింది. ఉదయాన్నే వర్షం మొదలవడం చూసి జానకి పక్కింటివాళ్ళు, ఎదురింటి వాళ్ళు శాపనార్థాలు పెట్టడం గుర్తొచ్చింది జానక్కి. వీళ్ళకి వర్షమంటే విసుగూ, చికాకూ. ఎలా పనులకు వెళ్ళాలా అని ఆందోళన. నీటిఎద్దడంటే పెద్దగా తెలీదు వీళ్ళకి. ఒకవేళ వున్నా దాన్నధిగమిస్తూ పక్క రాష్ట్రాన్నుండి కాలువలతో నీళ్ళు తెప్పించుకోగల సమర్థులు.

కానీ తమ ఊళ్ళో అలా కాదు. చిన్న మేఘం ఆకాశంలో కన్పించినా, ఒక్క వర్షపు చినుకు చిటపట విన్పించినా రైతులంతా ఆనందంతో నాట్యం చేస్తారు. దేవుళ్ళకి మొక్కుతారు.

ఇక్కడ వీళ్ళకి వానొస్తే విసుగు... అక్కడ వాళ్ళకి వాన రాలేదని దిగులు... వాళ్ళు మట్టి పిసుక్కునే వాళ్ళయితే... వీళ్ళిక్కడ మనీ పిండుకునేవాళ్ళు...

తన భర్త కూడా అక్కడ మట్టి పిసుక్కుంటున్నాడు. అగ్రికల్చర్ బి.ఎస్సీ చదివి ఏదయినా మంచి ఉద్యోగం చూసుకోక యిదేవిటీ అని ప్రశ్నించినపుడు అన్నలిద్దరూ జీవితాల్ని వెదుక్కుంటూ వెళ్ళిపోయారు. తను మాత్రం ఈ పుట్టిన వూరినీ, కన్నతల్లినీ, నేలతల్లినీ వొదిలి వెళ్ళలేననీ, యిక్కడే వ్యవసాయం చేసుకుంటాననీ భీష్మించుక్కూచున్నాడతడు. పిల్లలు పెరిగి స్కూలుకెళ్ళే సమయమొచ్చేసరికి తనే పట్టుబట్టింది. మన అభిప్రాయాల కోసం పిల్లల భవిష్యత్తును పాడుచేసే హక్కు మనకి లేదంది. అతడు విన్నాడు కాదు. తనే ఈ మహాపట్నంలో చిన్న ఉద్యోగం చూసుకుని వచ్చేసింది. అందుకు తను చాలా పోరాటం చేయాల్సివచ్చింది.

తమ ఊరు తమిళనాడు బోర్డర్స్‌లోనే వుండడంతో అతడు తరచుగా వచ్చి వెళ్తుంటాడు. ఇక్కడ తనకి తోడుగా చిన్నత్తగారు వుంది. జానక్కి హఠాత్తుగా భర్త గుర్తొచ్చాడు. మొదట్లో శరీరావసరాలకోసమో పిల్లల్ని చూడ్డం కోసమో అతడు వెంట వెంటనే వచ్చేవాడు. క్రమంగా అతడి రాకపోకలు అరుదైపోయాయి. అదేమంటే దున్నుతున్నామనో, నాటుతున్నామనో, కోతలనో సమాధానం వస్తుంది.

జీవితాల్ని అన్వేషించే క్రమంలో భార్యాభర్తలిరువురూ ఆ విధంగా ఒకరికొకరు అపరిచితులయిపోయారు.

"ఒరు క్రోమ్‌పేట్" అంటూ దూరంగా వున్న ఒక అమ్మాయి వొంగి తన చేతిలో డబ్బులు పెట్టింది టిక్కెట్టు కొనమంటూ. తను వెనక్కి తిరిగి కండక్టరు దగ్గరికి పాస్ చేసింది డబ్బులు. కండక్టరు యిచ్చిన టిక్కెట్టుని వెనుక నిల్చున్న వ్యక్తి అందుకుని జానకి చేతికివ్వకుండా నేరుగా అమ్మాయి వద్దకు రెండడుగులు వేసి టికెట్టందించే నెపంతో ఆమె చేతిని తాకాడు. పింక్ కలర్ చుడీదార్ వేసుకుని వుందామ్మాయి. పచ్చటి ఆమె శరీరానికి ఆ రంగు బాగా నప్పింది. చిదిమితే పాలు కారేట్టుగా వున్న అమ్మాయి ముఖం ఒక్కసారిగా అమ్మాయి వేసుకున్న డ్రస్సు రంగులోకి మారడం జానకి గమనించింది. టికెట్టందిస్తూ అమ్మాయి చేతిని తాకినవాడు తిరిగి వెనక్కి అక్కడే సర్దుకున్నాడు.

వాడి దారిలోనే మరో యిద్దరు కుర్రాళ్ళు ఆ పింక్ పప్పీ మీద కామెంట్లు విసురుతూ నవ్వుకుంటున్నారు.

అప్పుడే చిత్రించిన తడి ఆరని తైలవర్ణ చిత్రంలా వుందామ్మాయి. బహుశా సిటీబస్సు ప్రయాణం కొత్తలా వుంది. ముడుచుకుపోతోంది. ఆమె శరీరాన్ని చౌకబారుతనంతో పొడుచుకు తింటోన్న ఈ మగాళ్ళ కనుగుడ్లు పెరికే శక్తి ఒక్కసారి ఈ చేతులకొస్తే బావుణ్ణు అనుకుంది జానకి. మరికొన్నాళ్ళు యిలానే సిటీబస్సులో ప్రయాణం చేయాల్సి వస్తే జీవితం మీద విరక్తి కలుగుతుందా అమ్మాయికి. ఇంకా మాట్లాడితే రేపు పెళ్ళయ్యాక మొగుడి దగ్గర స్పందనలు లేకుండాపోవచ్చు. ఇలా ఆలోచిస్తూంటే ముందు నవ్వు, ఆ తరువాత దిగులూ కలిగాయి జానక్కి. కొంత దూరం సాగింది బస్సు. ఆ కుర్రాళ్ళ వెకిలి చేష్టలు మితిమీరుతుండడం గమనించి ముందు కొంత తటపటాయించినా చప్పున పైకి లేచింది జానకి. తన సీట్లో హేండ్‌బ్యాగూ, గొడుగూ వుంచి ఒక్కడుగు ముందుకేసి వొంగి కుడిచేత్తో అమ్మాయి ఎడమచేతిని పట్టుకుని మెల్లగా తనవైపు రమ్మన్నట్టుగా కళ్ళతోనే పిలిచింది. అమ్మాయి ఆశ్చర్యంతోనూ, జంకుతోనూ ముందు వెనకలాడుతూ మెల్లిగా జనాల్ని తప్పించుకుంటూ వచ్చి జానకి ఆఫర్ చేసిన సీట్లో కూర్చుని 'థాంక్యూ ఆంటీ' అంది గొణిగినట్లుగా. అమ్మాయి కూర్చున్న తరువాత ఆ సీటుకి ముందూ, వెనకా వున్న రాడ్లని రెండు చేతులతోనూ పట్టుకుని అడ్డంగా నిల్చుంది జానకి.

"ఆంటీ రొంబ నల్లదుడా."

"ఇంద మాదిరి ఆంటీ ఇరుకుణం (ఇలాంటి ఆంటీ వుండాలి)" అంటూ రకరకాలుగా ఆ కుర్రాళ్ళు తనని ఆటపట్టించడం తెలుస్తూనే వుంది. అయినా అదేమీ గమనించనిదానిలా ఇంకా బస్సులోని మిగతా వారి చూపుల్ని తప్పించుకోవడం కోసం కిటికీలో నుండి రోడ్డుమీదికి చూడసాగింది. అప్పటికి వాన వెలిసినట్టుంది.

రోడ్లమీద ఘోరమైన రద్దీ... దీనికి అనుసంధానంగా చెప్పలేనంత ధ్వని కాలుష్యం... రోడ్లనిండా నిండిపోయిన వాహనాల మోతలనధిగమిస్తూ రోడ్ల మధ్యనే

మీటింగులు... వాచ్యంగా తప్ప ఎక్కడా కనపడని నీతి ధర్మం సత్యం వంటి బోధలు... అనుగ్రహభాషణలు... క్షుద్ర రాజకీయాలు, మాయదారి స్టుప్పిడ్ సినిమాలు... అర్ధనగ్న పోస్టర్లను చూస్తూ ఆగిపోయిన మనుషులు... ఫుట్‌పాత్ దగ్గరగా వెళ్ళి ఆగిన బస్సు... ప్రతిరోజూ యింటికి వెళ్ళేదాకా నమ్మకముండదు. నగరాల్లోకి మనుషులంతా జీవిత పుస్తకాల్ని రోడ్లమీద ఆరేసి వుంటారు.

ఒక్కసారిగా కళ్ళు తిరిగినట్టయింది జానక్కి...

ఉదయం పనుల హడావిడిలో పడి టిఫిను తినలేదు జానకి. మరి యిక ఏ పనినీ వాయిదా వేయడం కుదరదు కాబట్టి కడుపుకి తినడమనే పనిని మాత్రం తేలిగ్గా వాయిదా వేసేస్తుంటుందామె. పెదాలు బిగబట్టి గట్టిగా కళ్ళుమూసుకుంది.

అదృష్టవశాత్తూ ఆమె దిగాల్సిన స్టాపింగ్ అప్పటికి బాగా దగ్గరయింది.

✦ ✦ ✦

పడమటి సూర్యుడు ఎర్రబడుతూన్న వేళ .

గూడు చేరడానికి ఆతృత పడుతూన్న పక్షుల్లా జనమంతా ఎడాపెడా ముందుకీ వెనక్కీ కదులుతున్నారు.

'ఇది మరీ పీక్ అవర్... ప్చ్...' అప్పటికి అరగంట నుండీ బస్టాప్‌లో నిల్చున్న జానకి యిప్పటికిలా అనుకోవడం పదోసారి.

ఏదో బస్సొచ్చి ఆగింది . జానకిని తోసుకుంటూ బస్సువైపు పరిగెత్తారు జనం ... జానక్కి చిరాకేయలేదు . వారి పరుగునీ పరుగులోని ఆతృతనీ చిత్రంగా గమనిస్తోందామె .

వీళ్ళంతా ఎక్కడికెళ్తున్నారు. కడుపు చేతబట్టుకుని యింతమంది జనం ఏ మారుమూల నుండి పట్నానికొస్తున్నారు? ఈ సమాధానం దొరకని అనుమానం జానక్కి దాదాపుగా ప్రతిరోజూ కలుగుతూనే వుంటుంది.

ఎన్నో కాంతిసంవత్సరాలు గడిచిపోయాక మళ్ళీ ఏదో బస్సొచ్చింది.

"గమలా... వా... వా టోంటీ సెవెన్ వందుడ్చి" తన ముందు నుండి ఒకామె కమలని అరుచుకుంటూ పరిగెత్తింది. జానకి కూడ ఉలిక్కిపడి బస్సుకేసి కదిలింది. టొంటీ సెవెవన్ వెనుకనే సెవెంటీ ఒన్-బి కూడ వస్తోంది.

జానకి వద్దనుకున్నా మామూలుగానే తోసుకుంటూ, తొక్కుకుంటూ కుమ్ము కుంటూ బస్సులోకి ఎక్కింది. సీటన్నచోటే కన్పించక రోజూలానే రాడ్ పట్టుకుని నిల్చుంది. నిల్చోడానికంటూ చోటు దొరకడంతో ఆనందపడిపోయింది.

ఎక్కడంలో చేతిలోని ఫైలు ఒకింత నలిగింది. ఆఫీసరు పెట్టే శాపనార్థాలు గుర్తొచ్చాయి. దాంతోపాటు వాడి సూదిచూపులూ, డేగకళ్ళు గుర్తొచ్చాయి.

పొద్దున్న కళ్ళు తిరిగి ఒకింత ఆలస్యంగా వెళ్ళినందుకు ప్రత్యేకంగా పిలిచి వాడిచ్చిన వార్నింగ్ గుర్తొచ్చింది. మరో గంట ఓ.టి. చేయమనీ, కార్లో వదుల్తాననీ వాడు బతిమాలిన విషయం గుర్తొచ్చింది.

అసలీ వేధింపులూ, లైంగికహింస వీటిని ఆడవాళ్ళని అణచివేయడానికి సరైన సాధనాలుగా ఎంచుకుంటారు వీళ్ళు... ఈ వేధింపనేది మగాడి చేతిలోని తురుపుముక్క.

మంచివాళ్ళూ వుండకపోరు... పాపం తన పక్క సీట్లోని నటరాజన్ నోట్లో నాలుక లేనివాడు... పిల్లలు గలవాడు... గవర్నమెంటిచ్చే జీతం చాలక ఈమధ్యనే ఏదో గడ్డి తిన్నాడు వెయ్యికో, రెండువేలకో. అతడ్నా రోజు పోలీసుల్ని పిలిపించి అరెస్ట్ చేయించాడు ఆఫీసరు. ఈ చిన్నచిన్న అమౌంట్లకి కక్కుర్తిపడేవాళ్ళు మాత్రం దొరికిపోతుంటారు. కానీ ఎటొచ్చీ లక్షలకి లక్షలు చేతులు మారుతూనే వుంటాయి అనేకానేక నీతిమాలిన పనుల్లో. పిల్లలుగల పేద నటరాజన్‌లాంటి వాళ్ళను అరెస్ట్‌చేసి తన నిజాయితీని నిరూపించు కుంటూ వుంటుంది ప్రభుత్వం. పాపం నటరాజన్ పిల్లలు, భార్య ఎంత బాధపడ్తున్నారో? అతడ్ని విడిపించుకోడానికి శక్తి చాలనివాళ్ళు... పరిచయాలు లేనివాళ్ళు... డొక్కలు ఎండిపోయిన బక్కజీవులు... వీరి బాధకి కారణమైన ఆఫీసరు మీద చెప్పలేనంత కోప మొచ్చింది జానక్కి.

చిరాగ్గా తల విదిలించి ఆఫీసరు ఆలోచనల్లో నుండి బయటపడాలని చూసిం దామె. తను కాపరముంటోన్న అంబత్తూరు మునిసిపల్ ఆఫీసుకి ట్రాన్స్‌ఫర్ చేయించు కోవాలని చాలారోజులుగా ప్రయత్నిస్తోంది జానకి. ఆ విషయమై యిల్లుగల్ల మామి కొడుకుతో పాటు వెళ్ళి ఆ ఏరియా ఎమ్.ఎల్.ఎ.ని కూడ కలసింది. తప్పకుండా చూస్తానని మాట యిచ్చాడతడు. దానిక్కూడా ఏమయినా చేతులు తడపాలేమో జానక్కి తెలీదు. మామి కొడుకు కనుక్కొని చెప్తానన్నాడు. ఇలా రాజకీయనాయకుల వద్ద పన్లు చేసిపెట్టి, మామూలు మనుషుల వద్ద గుంజిన డబ్బులతోనే మామి కొడుకు యిన్ని పోర్షన్ల యిల్లు కట్టాడని

అంత పెద్ద మొత్తంలో అవినీతి, ఇంత నీచస్థాయి అల్పసంతోషిత్వం. రూపాయికీ, అర్థకీ అంతరాత్మని అమ్ముకునే తత్వం, వంచనలో నిపుణులయిన రాజకీయ నాయకులూ, ఇంత దురాక్రమణ బుద్ధీ, ఇన్ని రోగాలూ మందులూ, మురికీ, ఇన్ని దోమలూ, కాలుష్యం, కులమత భేదాలూ ఎక్కడా ఏ దేశంలోనూ వుండదేమో.

'ఉక్కారుంగూ' తన పక్క సీటు చూపిస్తూ ఆశ్చర్యంగా పిలిచిందామె జానకిని.

ఆలోచనలోపడి తన ముందున్న సీటు ఖాళీ అయిన విషయం కూడ గమనించ నందుకు సిగ్గుపడుతూ కూర్చుంది జానకి. అలా తాపీగా కూర్చోగానే హఠాత్తుగా జానక్కి భర్త గుర్తొచ్చాడు. ఆమె గుండెనిండా ఒక వెచ్చటి ప్రేమభావం కమ్ముకుంది. ఇవ్వాళ శనివారం అతడొస్తే బావుండును. ఈ సిటీబస్సు ప్రయాణంలోనూ, ఆ ఆఫీసులోనూ తను పడుతోన్న కష్టాలన్నీ ఏకరువుపెట్టి ఒకింత ఊపిరి తీసుకోవచ్చు. ప్చ్... ఏవంటా డతను మాత్రం... ఉద్యోగం వదిలిపెట్టి వచ్చేయమంటాడు. పిల్లల్ని అక్కడే ఆ వూళ్ళోని స్కూల్లో చేర్పిద్దామంటాడు. నేలతల్లిని నమ్మి చెడిపోయినవాళ్ళు లేరంటూ వుపన్యాసా లిస్తాడు. అవన్నీ అంగీకరించడానికి తను సిద్ధంగాలేదు కాబట్టి అతడి సానుభూతి కోరక పోవడమే మంచిది.

బస్సు ఏదో స్టాపింగ్‌లో ఒక్క కుదుపుతో ఆగింది. ఆగిన బస్సులో నుండి బయటికి చూసింది జానకి. మొన్నామధ్య మిస్‌వరల్డ్‌గా ఎంపికయిన యుక్తాముఖి పోస్టరు పెద్దదిగా గోడ కంటించి దానికింద తమిళంలో ఏదో రాసుంది. ఏమిటో ఈ అందాలపోటీలు అసలెందుకు నిర్వహిస్తున్నారో వాళ్ళకే అర్థంకావాలి.

స్త్రీలను మభ్యపెట్టడానికే తప్ప మరేంకాదు. ఇవి అందానికీ తెలివికీ పోటీలు కావు. తమ సరుకుల్ని వారు క్రేజీగా కొనుక్కోవాలనే కుట్రలో ఆడవాళ్ళ శరీరాల్ని వాడు కోవడానికి సోపానాలు మాత్రమే. ఇవి తమ వ్యక్తిత్వాన్ని ఎంతగా కించపరుస్తున్నాయో పాపం ఈ పిచ్చివాళ్ళకి అర్థంకాదు. పోటీలు... పోటీలు... అన్నిట్లో పోటీలు... పరుగు పందాలు.

జానకి బస్సంతా ఒకసారి కలియజూసింది.

బస్సులో తనతోపాటు ప్రయాణిస్తోన్న వాళ్ళందరి ముఖాలూ కంప్యూటర్ గ్రాఫిక్స్‌లా మారిపోతున్నాయి. తన ముందు సీట్లో కూర్చుని వున్న కండక్టరు ముఖం తోడేలై కోరలు చాస్తోంది. ఎన్నో వందల ఏళ్ళ సిటీబస్సు ప్రయాణపు అనుభవం జానకి గుండెను రాయి చేసేసింది. జానక్కి యిప్పుడు పులులన్నా, తోడేళ్ళన్నా, సింహాలన్నా భయంలేదు. ఎటొచ్చీ మనుషుల ముఖాల్నీ అందులో ముఖ్యంగా కళ్ళనీ చూసినపుడు మాత్రమే అలర్జీ వచ్చేస్తుంది.

అది అసహ్యమో, అసహ్యంలాంటి మరో స్పందనో తెలీని విధంగా జానకి హృదయాన్నీ, శరీరాన్ని కూడా కమ్మేస్తుంటుంది. ఆ సమయంలో జానకి వూపిరితిత్తులు ప్రాణవాయువందక అల్లాడుతుంటాయి.

ఒక్కసారి గట్టిగా వూపిరి పీల్చుకుని చుట్టూ కలియచూసింది. అప్పటికి అక్కడా అక్కడా ఒకరిద్దరు తప్ప ఎవరూ నిల్చునిలేరు. బస్సులో కిటికీ నుండి బయటికి చూస్తే ఒక క్యూ కన్పించింది. 'హమ్మయ్య ఈరోజు రేషన్ పని లేదు' భారంగా నిట్టూర్చింది జానకి. సునీల్‌కి అప్పగించి వచ్చింది. బావగారబ్బాయి సునీల్ తమతోనే వుంటున్నాడు. గతంలో బాగా హెల్పింగా వుండేవాడు. ఇప్పుడు టెన్త్ క్లాసుకొచ్చాక వాడికి స్నేహపు పరిధి పెరిగింది. వాడీ రోజు స్కూలుకి వెళ్ళనన్నాడు వర్షం మూలంగా. మధ్యాహ్నం వెళ్ళి రేషన్ తెచ్చే వుంటాడు.

తనయితే మళ్ళీ నాలుగు స్టాపింగులు వెనక్కి రావాల్సి వుంటుంది.

మెల్లిగా వెనక్కి వాలి రిలాక్స్‌డ్‌గా కళ్ళు మూసుకుంది జానకి. భర్త తాలూకూ జ్ఞాపకాలు, అతడి దగ్గరితనం, యింకా తమ పెళ్ళి, అంతకు ముందు కాలేజీ... వెనక్కి వెళితే బాల్యం... అమ్మ- ఇలా ఏవేవో సంగతులు కలగాపులంగా జానకి బుర్రని చుట్టేస్తున్నాయి .

జానకి యింట్లో అడుగుపెట్టేటప్పటికి పెద్ద సౌండ్‌లో టి.వి. ఆన్ చేసి ఎదురుగా కుర్చీలో కూర్చుని వుంది పిన్నత్తగారు. బాబు నట్టింట్లో కింద మోకాళ్ళమీద వొంగి మొన్న ఎగ్జిబిషన్లో కొన్న రైలుబండిని రిపేరు చేస్తున్నాడు. వాడింకా స్కూలు డ్రస్ కూడ

విప్పినట్లులేదు. పాప పనిమనిషి కడిగి పెట్టిన గిన్నెలన్నింటినీ దొడ్లోనుండి లోపలికి మోసుకొచ్చి సర్దుతోంది.

ఉదయం నుండీ ఆ సిటీబస్సులో రాని తలనొప్పి యింట్లోకి అడుగుపెట్టగానే నేనున్నానంటూ తోడొచ్చేసింది. నిట్టూరుస్తూ లోపలికెళ్ళి కాస్త మొహం కడుక్కొని కాఫీ కలుపుకు తెచ్చుకుంది.

పిల్లల్ని కానీ, అత్తగార్ని కానీ పలకరించలేదామె.

జానకి వచ్చి కూర్చోగానే,

"జానకీ ఆ పనిపిల్ల రేపూ, ఎల్లుండీ రాదట... దాని మొగుడికేదో జబ్బు చేసిందని ఆస్పత్రికి తీసుకెళ్ళాలంట. మధ్యాహ్నం కూరలేవీ మిగిలిలేవమ్మా. నువు ఏం చేద్దామంటా వోనని ఆగాను" చెప్పింది అత్తగారు.

అన్ని కూరలూ యింట్లోనే వున్నాయి కదా... ఏదో ఒకటి చూసి చేసేయొచ్చుకదా అనబోయి "అలాగే చేస్తాన్లెండి అత్తమ్మా" అంటూ నవ్వింది. జానకి లోలోపల నిలువునా చీలిన సహనం బయటకొచ్చేప్పటికి అలా ముసుగేసుకుంటూ వుంటుంది చాలాసార్లు.

"సునీల్ రేషన్ తెచ్చాడా అత్తమ్మా" వంట మొదలుపెట్టటానికి వెళ్ళబోతూ క్యాజువల్గా ప్రశ్నించింది.

"లేదమ్మా. ఏదో ప్రైవేటు క్లాసులున్నాయని పొద్దుననగా వెళ్ళాడు."

✦ ✦ ✦

చకచా రెండు బ్యాగులూ, రేషన్కార్డు పట్టుకుని చెప్పులు తొడుక్కుంది జానకి.

'ఇదిగో ఏదో ఉత్తర మొచ్చిందంటూ' తెచ్చింది అత్తగారు ... ప్రభుత్వపు ముద్ర చూసి విస్తుపోతూ విప్పింది జానకి.

జానకి కోరుకున్నట్లుగా తాను పనిచేస్తున్న ఆఫీసు నుండి ట్రాన్స్ఫర్ ఆర్డర్స్ వచ్చాయి. అయితే తనుంటోన్న అంబత్తూరు మున్సిపలాఫీసుకి కాదు. అటు ఆలందూర్ ఆఫీసుకి. అంటే రేపట్నుంచీ జానకి రెండు బస్సులు మారి ఆఫీసుకి వెళ్ళాల్సి వుంటుంది.

చీకటి పడ్తూండగా ఆకాశంలో నల్లటి మబ్బులు కమ్ముకున్నాయి.

మెరుపులు మెరుస్తున్నాయి. వెయ్యి ఏనుగులు యుద్ధానికి సన్నద్ధమవుతున్నట్లు మేఘాలు గర్జిస్తున్నాయి.

నిర్వికారంగా జానకి బస్టాప్ వద్ద నిలబడి వుంది రేషన్షాపుకి వెళ్ళే బస్సు కోసం.

*గమనం సాహిత్య సంచిక, 2001*